
సాక్షి
అనంతపురం

గురువారం । 22 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



'సోషల్' స్టార్ ప్రశాంత్

తన వీడియోల ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తూ 'సోషల్ మీడియా' స్టార్‌గా దూసుకుపోతున్నాడు ప్రశాంత్ అలియాస్ ప్రసూబేజీ.

8లో

గరిష్టం/కనిష్టం
38.2°/23.8°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

14 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 14 మండలాల పరిధిలో 4.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. శింగనమల 40 మి.మీ., పెద్దపప్పూరు 17.8, యాడికి 13.4, బ్రహ్మసముద్రం 13.2, తాడిపత్రి 10.6 మి.మీతో పాటు తాడిపత్రి, కూడేరు, పుట్లూరు, నార్పల, పెద్దవడుగూరు, గుత్తి, గార్లదిన్నె, యల్లనూరు, పామిడి, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా.. ప్రస్తుతానికి 36.2 మి.మీ నమోదైంది. ఈ నెలలో 10 మండలాల్లో మాత్రమే పదును వర్షం కురిసింది. ఖరీఫ్ పంటలు వేయడానికి మంచి వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

బెళుగుప్ప: పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమంతో ప్రజలతో మమేకమవుతూ శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం బెళుగుప్ప పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. మండల స్థితి గతులు, రోడ్డు ప్రమాదాలపై సీఐ శేఖర్, ఎస్‌ఐ రామకృష్ణయ్యలతో ఆరా తీశారు. అనంతరం జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కాలువపల్లి, హనిమరెడ్డిపల్లి, నరసాపురం, బ్రాహ్మణపల్లి, రమనేపల్లి, గుండ్లపల్లి మీదుగా యాక్సిడెంటల్ జోన్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఓవర్‌లోడ్, పరిమితికి మించి ప్రయాణం చేయడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు, మద్యానికి బానిసలు కాకుండా, గొడవలు కొట్లాటల జోలికెళ్లకుండా నియంత్రించేందుకు పోలీసులతో 'పల్లె నిద్ర' ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. ముఖ్యంగా భార్యాభర్తల గొడలు, బాల్య వివాహాలు జరగకుండా గ్రామ మహిళా పోలీసు వ్యవస్థ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.

హత్య కేసుపై ఆరా

కళ్యాణదుర్గం: కదరంపల్లిలో ఇటీవల జరిగిన కురుబ గోవిందరాజులు హత్య కేసుపై ఎస్పీ శ్రీనివాసరావు ఆరాతీశారు. బుధవారం రాత్రి కళ్యాణదుర్గం రూరల్ పోలీసుస్టేషన్‌ను ఎస్పీ సందర్శించిన అనంతరం రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ సుధాకర్‌తో కలిసి కదరంపల్లిలో హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ తేజ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

వైద్య వైభవం



- రెండు మాసాల్లో 33 పీజీ వైద్య సీట్ల పెంపు
- ప్రధాన భూమిక పోషించే రేడియాలజీలో ఒకేసారి 12
- గడిచిన నాలుగేళ్లలో 52 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం
- మౌలిక వసతుల కల్పన, అధ్యాపకుల నియామకంతోనే పీజీ వైద్యసీట్లు
- నూతన వైభవం సంతరించుకుంటోన్న అనంతపురం వైద్య కళాశాల

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాల రాష్ట్రస్థాయిలో పెద్ద కాలేజీలతో పోటీ పడుతోంది. ఒకప్పుడు అనంతపురం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేరాలంటే విద్యార్థులు వెనుకంజ వేసేవారు. ఇప్పుడు ఈ కళాశాలలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు. 2019కి ముందు కేవలం వంద ఎంబీబీఎస్ సీట్లకే పరిమితమైన ఈ కాలేజీ ఇప్పుడు ఎంబీబీఎస్ సీట్లు, పీజీ వైద్యసీట్లతో కళకళలాడుతోంది. తాజాగా మరో 33 పీజీ సీట్లు పెరగడంతో కాలేజీ స్థాయి మరింతగా పెరిగిందని చెప్పుకోవచ్చు.

నూతన శోభ..

వైద్యకళాశాలలో నాలుగేళ్లకు ముందు పీజీ వైద్య సీట్లంటే సింగిల్ డిజిట్‌కే పరిమితమై ఉండేది. కాలేజీలో మౌలిక వసతులు, నాడు – నేడు కింద పనులు చేపట్టడం, సిబ్బంది నియామకం చేయడం వంటి వాటితో గడిచిన రెండు మాసాల్లోనే 33 పీజీ వైద్య సీట్లు మంజూరయ్యాయి. దీంతో మొత్తం పీజీ వైద్యసీట్ల సంఖ్య 104కు పెరిగింది. వైద్య కళాశాల నూతన వైభవం సంతరించుకుంటోంది.

150కి చేరిన ఎంబీబీఎస్ సీట్లు..

2019 నాటికి అనంతపురం మెడికల్ కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవి. సరిగా అధ్యాపకులు లేక, మౌలిక వసతులు లేక ఆ వంద సీట్లను రెన్యూవల్ చేసుకోవడమే ఇబ్బందిగా ఉండేది. కానీ 2019 తర్వాత ఏకంగా 50 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా వచ్చాయి. దీంతో సీట్ల సంఖ్య 150కి చేరింది. రానున్న రెండేళ్లలో ఈ సీట్ల సంఖ్యను 200కు పెంచే యోచన ఉన్నట్టు కాలేజీ అధ్యాపక బృందం చెబుతోంది.

52 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు..

ఫ్యాకల్టీ (అధ్యాపకులు) లేక ఎన్నో కాలేజీలు సీట్లను కోల్పోయాయి. ఈ పరిస్థితుల్లో 2020 నుంచి ఇప్పటి వరకు 52 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఈ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన నియమించింది. ఇదే ఇప్పుడు పీజీ, ఎంబీబీఎస్ వైద్యసీట్లు పెరగడానికి దోహదపడింది. మొత్తం 32 విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. అవసరమైతే మరింత మందిని నియమించుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రేడియాలజీ సీట్లు రావడమంటే..

రేడియాలజీ పీజీ వైద్యసీట్లంటే ఆషామాషీ కాదు. ప్రైవేటు వైద్య కాలేజీల్లో రేడియాలజీ పీజీ సీటు రూ.3 కోట్లకు పైగా ధర పలుకుతోంది. సాధారణంగా ఈ సీట్లు ఒక్కోసారి రెండు లేదా మూడుకు మించి రావు. కానీ ఇక్కడ ఒకేసారి 12 రేడియాలజీ సీట్లు రావడం గమనార్హం. ఒకవిధంగా పేద విద్యార్థులకు ఇది వరంగా చెప్పుకోవచ్చు.

పీజీ వైద్య సీట్లు ఇలా..

అనాటమీ	9
ఫార్మకాలజీ	5
రేడియాలజీ	12
మైక్రో బయాలజీ	7
ఇప్పుడు మొత్తం పీజీ సీట్లు	104
ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్లు	150
మూడేళ్లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం	52

మరిన్ని పీజీ సీట్లు తెస్తాం



రెండు మాసాల్లోనే 33 పీజీ వైద్య సీట్లు రావడం శుభపరిణామం. సీట్లు వచ్చేందుకు కావాల్సిన అన్ని వసతులు కల్పించినందుకే ఎన్‌ఎంసీ పీజీ వైద్యసీట్లను మంజూరు చేసింది. మరిన్ని పీజీ వైద్యసీట్లు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– డా.శ్రీదేవి, ప్రిన్సిపాల్, అనంతపురం వైద్య కళాశాల

శ్రీనివాస ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ సేవలు రద్దు



శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిపై ఆరోగ్యశ్రీ సీఈఓ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలను రద్దు చేశారు. 15 రోజుల క్రితమే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడి ఆరోగ్య మిత్రను మరో ఆస్పత్రికి బదిలీ చేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త (డీసీ) డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి బృందం ఏడాది వ్యవధిలో మూడుసార్లు తనిఖీ చేసింది. ఎనిమిది మంది డ్యూటీ వైద్యులను ఆస్పత్రి నిర్వాహకులు చూపలేదు. సిబ్బంది తగినంత లేరు. శానిటేషన్ అధ్వానంగా ఉంది. రోగులకిచ్చే మందుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. ఈ అంశాలను ఉన్నతాధికారులకు నివేదించారు. కొంతకాలం క్రితం ఆరోగ్య శ్రీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జేఈఓ) డాక్టర్ శ్రీదేవి, ఆరోగ్య శ్రీ డీసీ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి మరోసారి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసినపుడు కూడా నిర్వహణలో ఎలాంటి మార్పూ కనిపించలేదు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ రాష్ట్ర డిసిప్లినరీ కమిటీ అధికారిగా ఉన్న డాక్టర్ శ్రీదేవి సదరు శ్రీనివాస ఆస్పత్రిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆరోగ్యశ్రీ సేవలను రద్దు చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితా నుంచి పేరు తొలగించారు.

'నవోదయ' ఫలితాల విడుదల

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. లేపాక్షి విద్యాలయానికి సంబంధించి 78 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పోస్టల్ కార్డు, ఇతర కమ్యూనికేషన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు. ఫలితాలు www. navodaya. gov. in వైబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. వివరాల కోసం లేపాక్షి విద్యాలయను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో ఇద్దరు తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో ఈ –సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉన్న హరికుమార్‌ను నార్పల తహసీల్దారుగా నియమించారు. ఇదే క్రమంలో ఆయనను డిప్యుటేషన్‌పై రెండు నెలల కాలం కలెక్టరేట్‌లోనే పనిచేసేలా ఉత్తర్వులో పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి పరస్పర బదిలీపై జిల్లాకు వస్తున్న తహసీల్దారు బాలాజీరావును కలెక్టరేట్ ఈ–సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమించారు.

చేనేతల అభ్యున్నతే ధ్యేయం

- ఎంపీ తలారి రంగయ్య



చేనేత కార్మికులకు పనిముట్లు అందిస్తున్న ఎంపీ రంగయ్య

ఉరవకొండ: చేనేతల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో ఉన్న చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ పరిధిలోని చేనేతలకు మంజూరైన పనిముట్ల పంపిణీ ప్రక్రియ బుధవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, రాష్ట్ర చేనేత జౌళి శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రాజారావు, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి అప్పాజీ, కేంద్ర చేనేత జౌళి శాఖ సహాయ అధికారి పృథ్వీ, నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ అధికారి విశ్వనాథం, జిల్లా చేనేత అభివృద్ధి అధికారి బసవరాజు హాజరయ్యారు. ఉరవకొండ చేనేత బ్లాక్‌లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రంగయ్య మాట్లాడుతూ... చేనేత కార్మికులకు నూతన డిజైన్లపై శిక్షణతో పాటు వారికి అవసరమైన పనిముట్లు, వర్క్‌షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వాలు చేపట్టిన చర్యలను వివరించారు. కొత్త శ్రీనివాసులు మాట్లాడుతూ.. తమ క్లస్టర్ పరిధిలోని 139 మంది కార్మికులకు రూ.25లక్షలు విలువ చేసే పనిముట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.44.70 లక్షలు విలువ చేసే చేనేత వర్క్‌షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం వర్క్‌షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ సుశీలమ్మ, రాష్ట్ర ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు వెంకటేష్, గోవిందు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తిప్పయ్య, చేనేత నాయకులు ఎంసీ నాగభూషణం, చెంగల మహేష్, కాసుల అంజి, బీరే శివ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలు, దౌర్జన్యాల చరిత్ర మాది కాదు

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: భూ కబ్జాలు, దౌర్జన్యాలు చేసే చరిత్ర తమ కుటుంబానికి లేదని, కేవలం కొందరు తన కుమారుడు భీమిరెడ్డిని లక్ష్యంగా చేసుకుని అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. అనంతపురం సమీపంలోని కురుగుంటలో ఇతరుల భూమిని కబ్జా చేసినట్లు కొందరు చేసిన ఆరోపణలపై ఎల్లో మీడియా వెలువరించిన అసత్య కథనాన్ని ఆయన ఖండించారు. ఉరవకొండలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 102లో 1.50 ఎకరాల భూమిని తన కుమారుడు భీమిరెడ్డి 2018లో కాబూల సాహెబ్ వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని గుర్తు చేశారు. అయితే కాబూల సాహెబ్ వారసుల మధ్య వివాదం కారణంగా అనవసరంగా తమ పేర్లను ప్రస్తావించడం తగదన్నారు. ఈ వ్యవహారంలో ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కాబూల సాహెబ్ మాట్లాడుతూ.. తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.50 ఎకరాల భూమిని మాత్రమే విక్రయించినట్లు తెలిపారు. విక్రయించిన భూమిలో తమకు ప్లాట్లు ఉన్నాయంటూ కొందరు తెరపైకి వస్తున్నారని, ఇది అవాస్తవమని స్పష్టం చేశారు.

దిశ యాప్‌తో తక్షణ రక్షణ



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఐజీ

అనంతపురం సిటీ: దిశ యాప్‌తో మహిళలకు తక్షణ రక్షణ లభిస్తుందని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. దిశ యాప్‌ను ప్రతి విద్యార్థినీ తమ సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థినులతో డీఐజీ మాట్లాడారు. దిశ యాప్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టలేషన్‌తో పాటు ఎలా వినియోగించాలో వివరించారు. ఆపత్కాలంలో ఈ యాప్ ద్వారా సత్వర రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం దిశ కేసుల విచారణ తీరును విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో 'దిశ' సీఐ చిన్న గోవిందు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు 'ఈ-కేవైసీ' తప్పనిసరి

- నెలాఖరు వరకు గడువు ఇచ్చిన కేంద్రం



పీఎం కిసాన్ ఈ–కైవేసీ లోగో

అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు లబ్ధి పొందే రైతులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) యు.ఉమామహేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ విడత నుంచి ఈ–కేవైసీ తప్పనిసరి చేసినా... గతేడాది 12, 13వ విడత సొమ్ము ఎలాగోలా జమ చేశారని పేర్కొన్నారు. త్వరలో ఇవ్వనున్న 14వ విడత పీఎం కిసాన్‌కు కచ్చితంగా ఈ–కేవైసీ ఉండాల్సిందేనని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతూ ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, అలాగే ఓటీపీ ఆధారంగా నెలాఖరు లోపు అథెంటిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. మీ–సేవ లేదా కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌బీకే అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి వేలిముద్రలతో ఈ–కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. లేదంటే www. pmkisan.gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో కూడా చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

48 వేలు పెండింగ్..

జిల్లా వ్యాప్తంగా 3.31 లక్షల పీఎం కిసాన్ అకౌంట్లు ఉండగా ... ఇంకా 48 వేల మందికి పైగా ఈ–కేవైసీ చేయించుకోలేదని డీఏఓ తెలిపారు. వీరందరూ తక్షణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకసారి జాబితా నుంచి డిలీట్ అయితే తర్వాత చేర్చుకోవడం కష్టమని పేర్కొన్నారు. అంతేకాకుండా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 పెట్టుబడిసాయం పొందడానికి కూడా సమస్యగా మారవచ్చని తెలిపారు. ఈ–కేవైసీ పూర్తి చేయడానికి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఈ–క్రాప్ డేటా ఆధారంగా ఈ ప్రక్రియ చేయించుకోని రైతులను గుర్తించి ఆర్‌బీకే అసిస్టెంట్ల ద్వారా చేయించుకునేలా చర్యలు చేపట్టామన్నారు.

ఆరోగ్య యోగం



యోగ ముద్రలో కలెక్టర్ గౌతమి

అనంతపురం కల్చరల్: 'యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. రోజూ యోగా చేయడం ద్వారా అన్ని వయసుల వారికీ సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది' అని కలెక్టర్ గౌతమి తెలిపారు. 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం అనంతపురంలో ఘనంగా జరిగింది. 'వసుదైక కుటుంబం కోసం యోగా' అనే ట్యాగ్‌లైన్‌తో ఆయుష్, వివిధ యోగా కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సామూహిక యోగాసనాలను కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒత్తిడి నిండిన జీవితాలకు యోగా అత్యవసరమని గుర్తించి పాఠశాల నుంచే యోగా అభ్యసించేలా చేస్తున్నామన్నారు. మన పూర్వీకులందించిన గొప్ప విద్య యోగా అని, అందరూ ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ఏఎస్పీ హనుమంతు, బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ సిస్టర్ శారద, వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు రాజశేఖరరెడ్డి మాట్లాడారు. యోగా శిక్షకురాలు కృష్ణవేణి అందరితో ప్రాణాయామం, సామూహిక యోగా, సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, ఆయుష్, హోమియో శాఖల అధికారులు తిరుపతి నాయుడు, డాక్టర్ రామకుమార్, టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి తదితరులు సామూహిక యోగాభ్యాసనాలు చేశారు.



యోగాభ్యాసనంలో ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న యోగా శిక్షకురాలు కృష్ణవేణి



యోగా సాధన

క్లుప్తంగా

జిల్లా జైలులో రేపు వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలు ఆవరణలో శుక్రవారం వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు సూపరింటెండెంట్ రహమాన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 23న ఉదయం 11 గంటలకు 20 వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.17,600 ధరావత్తు చెల్లించాలి. వేలం ప్రక్రియ ముగిసిన తర్వాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తారు.

జిల్లాకు చేరిన 979 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా బుధవారం 979 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లా కేంద్రానికి చేరినట్లు రేక్ ఆఫీసర్, అనంతపురం ఏడీఏ ఎం.రవి తెలిపారు. కంపెనీ నుంచి నేరుగా ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్‌కు చేరిన ఎరువుల బస్తాలను రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఛంబల్ కంపెనీ నుంచి 640 మెట్రిక్ టన్నుల డీఏపీ, 339 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) ఎరువులు వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా మొదటి ప్రాధాన్యత కింద ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌తో పాటు ప్రైవేట్ హోల్‌సేల్, రీటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. ఇండెండ్ పోనూ మిగిలిన ఎరువులు మార్క్‌ఫెడ్, కంపెనీల గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

రాయదుర్గం టౌన్: వరుస చోరీలతో రాయదుర్గం వాసులకు కంటి మీద కునుకు దూరమైంది. నెలన్నర రోజుల వ్యవధిలో దాదాపు ఐదు భారీ స్థాయి చోరీలు జరిగాయి. ఈ ఘటనలను మరవకముందే తాజాగా మరో చోరీ జరగడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. వివరాలు.. రాయదుర్గంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న నారాయణస్వామి, గుమ్మఘట్ట మండలం పూలకుంటలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తమ కుమార్తెను తిరుపతిలోని కళాశాలలో చేర్పించేందుకు మంగళవారం భార్య జ్యోతితో కలసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి తాళాలు పెకలించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో దాచిన 15 తులాల వెండి, రూ.60 వేల నగదు అపహరించుకెళ్లారు. తిరుపతి నుంచి బుధవారం తిరిగొచ్చిన నారాయణస్వామి దంపతులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, గత సెప్టెంబర్‌లోనూ తమ ఇంట్లో దుండగులు చొరబడి రూ.25వేలు అపహరించుకెళ్లారని, ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదంటూ ఈ సందర్భంగా నారాయణస్వామి అసహనం వ్యక్తం చేశారు.

సోషల్ స్టార్ ప్రశాంత్



అతను ఎంటెక్ చదివాడు. ప్రయత్నిస్తే సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ఉద్యోగమే వచ్చేది. కానీ అందరూ నడిచే దారిలో వెళ్లాలనుకోలేదు. తనకంటూ ప్రత్యేక 'మార్గం' ఉండాలని భావించాడు. ఆ మార్గంలో వెళ్లే క్రమంలో మొదట అందరూ హేళన చేశారు. అయినా నిరుత్సాహపడలేదు. ఎంచుకున్న రంగం ఏదైనా పట్టుదల, చిత్తశుద్ధితో కృషి చేస్తే విజయం సాధించవచ్చునని నిరూపించాడు. ఇంటిల్లిపాదీ ఆనందించే వీడియోలను సొంతంగా రూపొందిస్తూ..అందులో తానే నటిస్తూ సోషల్ మీడియా స్టార్‌గా ఎదిగాడు. అతనే ప్రశాంత్ అలియాస్ ప్రసూబేబీ.

- 'ప్రసూబేబీ'గా సూపర్ ఫేమస్
- యూట్యూబ్‌లో 8.24 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్టాలోనూ భారీ ఫాలోయింగ్
- ఇదీ ఎంటెక్ యువకుడి విజయగాథ

సాక్షి, అనంతపురం డెస్క్ :

సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎంతోమంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. తమకున్న నైపుణ్యాలు ప్రదర్శిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అలాంటి వారిలో ప్రశాంత్ ఒకరు. ఎలాంటి సినీ నేపథ్యమూ లేకపోయినా నటనలో సత్తా చాటుతూ.. అనతికాలంలోనే సోషల్ మీడియా సూపర్ స్టార్‌గా ఎదిగాడు. పొడవాటి జుట్టు, గడ్డంతో స్టైలిష్‌గా కన్పించే ప్రశాంత్ చక్కటి నటన, వైవిధ్యమైన డైలాగ్ డెలివరీతో అందరినీ అలరిస్తున్నాడు. ప్రశాంత్ అంటే ఎవరూ గుర్తు పట్టరు కానీ.. 'ప్రసూబేబీ' అంటే మాత్రం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారు ఇట్టే గుర్తు పట్టేస్తారు.

యూట్యూబ్ 'సూపర్ స్టార్'

ప్రసూబేబీ (prashu_baby) పేరిట ప్రశాంత్ ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు ఏకంగా 8.24 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. సంస్థలను మినహాయిస్తే వ్యక్తిగత విభాగానికి సంబంధించి రాష్ట్రంలో హర్షసాయి తర్వాత అత్యధిక సబ్‌స్క్రైబర్లు ఉన్నది ఈ చానల్‌కే. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంటు వీడియోలను రెగ్యులర్‌గా రూపొందించి ఇందులో అప్‌లోడ్ చేస్తున్నా డు. వీడియో పెట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి. ప్రశాంత్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంటుకు కూడా 1.4 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. భాషతో సంబంధం లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాల వారు, కువైట్, అమెరికా,సౌదీ తదితర దేశాల ప్రజలు సైతం ప్రశాంత్ వీడియోలను వీక్షిస్తున్నారు. ధరణి, శిశిర, ప్రసూ కాంబినేషన్‌లో వచ్చిన వీడియోలు సూపర్ హిట్ అయ్యాయి.

'అనంత' కేంద్రంగా.. నటనే శ్వాసగా..

ఎంటెక్ చదివేందుకు అనంతపురం వచ్చిన ప్రశాంత్ ఇక్కడి నుంచే సీరియస్ 'యాక్టింగ్' మొదలుపెట్టాడు. నటనపై ఆసక్తి ఉన్న తనలాంటి వారితో కలిసి వీడియోలు రూపొందిస్తున్నాడు. యాక్టింగ్ మొదలుకుని స్క్రిప్టు వరకు అన్నీ తానే చూసుకుంటాడు. ఇలా ఇప్పటివరకు 30 మందికి పైగా తనతో కలసి నటించారు. వారిలో చాలామందికి సొంత యూట్యూబ్ చానళ్లు, ఇన్‌స్టాగామ్ అకౌంట్లు ఏర్పాటు చేయించి..వారూ తగిన ఆదాయం పొందేలా చూస్తున్నాడు. సోషల్ మీడియాలో ప్రశాంత్ పాపులారిటీని గుర్తించిన పెద్ద పెద్ద సంస్థలు సైతం అతనితో వ్యాపార ప్రకటనలు చేయిస్తున్నాయి. సినిమా ప్రమోషన్లు కూడా చేయిస్తున్నారు. ఇటీవలే దసరా, విరూపాక్ష సినిమాలకు ప్రమోషన్ చేశాడు. ఓటీటీ, సినిమా ఆఫర్లు సైతం వస్తున్నాయి. పెద్దసంస్థలతో కలసి ఇతర భాషల్లో సోషల్ మీడియా వేదికగా వినోదాత్మక వీడియోలు రూపొందించే ఆలోచనలో ఉన్నాడు.

ఎంటెక్ చదివి.. టిక్‌టాక్‌తో మొదలెట్టి..

ప్రశాంత్ సొంతూరు అన్నమయ్య జిల్లా మదనపల్లెకు సమీపంలోని గారబురుజు గ్రామం. తల్లిదండ్రులు సావిత్రి, నారాయణ. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కుమారులు కాగా..ప్రశాంత్ చిన్నోడు. మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదివాడు. జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఎంటెక్ చేశాడు. ఇంజినీరింగ్ చదువుతుండగానే నటనపై ఆసక్తితో చిన్నచిన్న వీడియోలు సొంతంగా రూపొందించి 'టిక్‌టాక్'లో పెట్టేవాడు. ప్రేమ, మానవత్వం, కుటుంబం ఇతివృత్తంగా వీడియోలు రూపొందించేవాడు. అవి బాగా ట్రెండింగ్‌కావడంతో లక్షల్లో సబ్‌స్క్రైబర్లు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం టిక్‌టాక్‌పై నిషేధం విధించడంతో తన దృష్టిని యూట్యూబ్‌పై మళ్లించాడు.





దసరా సినిమా ప్రమోషన్‌లో భాగంగా నాని, కీర్తి సురేష్‌తో ప్రశాంత్



అమ్మానాన్నతో కలసి యూట్యూబ్ నుంచి వచ్చిన సిల్వర్, గోల్డెన్‌ప్లే బటన్స్ చూపుతున్న ప్రశాంత్

ఇష్టపడి పనిచేయడం వల్లే ఈ స్థాయికి..

ఏ పనైనా ఇష్టపడి చేయాలని నేను భావిస్తా. నేను ఇలా వీడియోలు చేయడాన్ని మొదట్లో స్నేహితులే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తప్పుబట్టారు. కానీ సక్సెస్ సాధించి వారితోనే అభినందనలు అందుకున్నా. నిత్య జీవితంలో జరిగే సంఘటనలు, కుటుంబంలో ఉండే సంతోషాలు, సరదాలు, సమస్యలే ఇతివృత్తంగా ఎక్కువ వీడియోలు రూపొందించా. ఇవి భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరికీ కనెక్ట్ అయ్యాయి. ఇదే ఉత్సాహంతో మరింత మంచి కంటెంట్ అందివ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా. ముఖ్యంగా వెబ్ సిరీస్‌లపై దృష్టి పెడుతున్నా. - ప్రశాంత్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో గందరగోళం



ఆందోళన చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

రాప్తాడురూరల్: కేజీబీవీల్లో సీఆర్టీ పోస్టుల భర్తీలో భాగంగా బుధవారం చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గందరగోళంగా మారింది. గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసిన తమకే సీఆర్టీగా అవకాశం కల్పించాలని కొందరు పట్టుబట్టారు. వాస్తవానికి కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసిన వారికి ఏడాదికి 0.5 మార్కులు వెయిటేజీ ఇస్తున్నారు. గరిష్టంగా 7.5 మార్కుల దాకా కొందరు అభ్యర్థులకు వచ్చాయి. అయితే మెరిట్ ఆధారంగా తీసుకోవడంతో చాలామంది అభ్యర్థులు వీరి కంటే ముందు వరుసలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 280 సీఆర్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో అందిన దరఖాస్తులను పరిశీలించి దాదాపు 850 మంది అభ్యర్థులతో మెరిట్ జాబితా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. వీరిలో చాలామంది మెరిట్ జాబితాలో వెనుకబడ్డారు. దీంతో వారందరూ సర్టిఫికెట్ల పరిశీల ప్రక్రియను అడ్డుకున్నారు. ఇన్నేళ్లుగా పని చేసిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, జీసీడీఓ వాణిదేవి, సూపరింటెండెంట్ సునీల్, ఇతర సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు ఎంత సర్దిచెప్పినా వినలేదు. దీంతో దాదాపు వంద మంది సర్టిఫికెట్ల పరిశీలన కాగానే ఈ ప్రక్రియ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ సంఘాలు గెస్ట్ ఫ్యాకల్టీల ఆందోళనకు మద్దతు తెలిపాయి. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో ఇదివరకే పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను సీఆర్టీలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సీఐటీయూ నగరకార్యదర్శి వెంకటనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రజిత పాల్గొన్నారు.

మద్యం, ఇసుక అక్రమ రవాణా అరికట్టండి

- సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ రామకృష్ణ

రాయదుర్గం: జిల్లాలో మద్యం, ఇసుక అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని సిబ్బందికి సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ సూచించారు. బుధవారం కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులతో కలసి రాయదుర్గం అర్బన్ పీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. స్థానిక పరిస్థితులు, క్రైమ్‌రేట్‌పై సీఐలు లక్ష్మన్న, యుగంధర్‌తో ఆరా తీశారు. సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల ఎస్ఐలు, సిబ్బందితో కలసి పట్టణ పరిసరాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద మహిళా పోలీసులతో సమావేశమై విధులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో జరిగే ఏ ఘటనైనా ఆ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలకు సత్వరం తెలియజేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోవు రోజుల్లో మరింత చురుగ్గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ హరికృష్ణ, ఆయా మండలాల ఎస్ఐలు శివ, రంగడుయాదవ్, దుగ్గిరెడ్డి, సునీత, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

- పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్



ప్రభుత్వ భవన నిర్మాణాలపై సమీక్షిస్తున్న భాగ్యరాజ్

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను ఆ శాఖ ఎస్ఈ భాగ్యరాజ్ ఆదేశించారు. సెప్టెంబర్‌లోపు నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై స్థానిక పీఆర్ కార్యాలయంలో డీఈ రాజన్నతో కలసి జేఈలు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ జరిగిన పనులకు బిల్లులు చెల్లించామన్నారు. ఇకపై ప్రభుత్వం నిర్దేశించిన ధరకే వైఎస్సార్ నిర్మల్ పోర్టల్ ద్వారా సిమెంట్‌ను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపు విషయంలో ఎలాంటి వదంతులను నమ్మొద్దని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లుల చెల్లింపులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జేఈలు వరప్రసాద్, కాంచన, మునిస్వామి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేడు జాతీయ నృత్యోత్సవం



శిష్యులతో కలసి సాధన చేస్తున్న నాట్యాచార్యులు సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: సంధ్యారవళి పేరిట ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో 12 గంటల నిర్విరామ నృత్యోత్సవం గురువారం జరగనుంది. అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా సాగే ఈ నృత్యోత్సవంలో ప్రాతినిథ్యం వహించేందుకు ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తరలివచ్చారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామ నృత్య ప్రదర్శన ఉంటుంది.ఇ ఉదయం ప్రారంభ కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. రాత్రి ముగింపు వేడుకలకు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను సన్మానించనున్నారు.వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గురువులకు 'ఆచార్య సింధూ' అవార్డును అందజేయనున్నారు. అలాగే నాట్య కళాకారులకు 'నర్తన సారంగి' అవార్డుతో సత్కరించనున్నారు.

కర్ణాటకలో చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకోవాలి

- రైతుగర్జన సభలో వక్తలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం అర్బన్: కర్ణాటకలో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన అప్పర్‌భద్ర, నవలీ ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు జిల్లాలో నీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు వక్తలు కోరారు. సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతుగర్జన సభ నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, సీపీఐ ఎంఎల్(ఎన్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు హాజరై, మాట్లాడారు. కర్ణాటకలో అక్రమంగా చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ తుంగభద్ర వరద నీరు కృష్ణానదికి, శ్రీశైలం జలాశయానికి సమృద్ధిగా అందుతున్నాయన్నారు. ఈ నీటిని దిగువకు రానివ్వకుండా కర్ణాటకలో ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. జిల్లాలో హెచ్చెల్సీఆధునికీకరణతో పాటు హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలన్నారు. టీబీ డ్యాం నుంచి సమాంతర కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. అకాల వర్షాల తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు నారాయణస్వామి, చిన్నప్పయాదవ్, లింగమయ్య, కేశవరెడ్డి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌సీ ప్రోగ్రామ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని స్కిల్ కళాశాలలో కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ (సీఎన్‌సీ)పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనందరాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. బీటెక్ (ఏ బ్రాంచ్ వారైనా), డిప్లొమో (ఏ బ్రాంచ్ వారైనా), ఐటీఐ(టర్నర్, ఫిట్టర్ మాత్రమే) పూర్తి చేసిన వారు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు మన్నీల గంగాధర్ (99492 50507), సంజామల రఫీ (94906 82810)ని సంప్రదించవచ్చు.

డ్రైవర్ల బదిలీల ప్రక్రియ వాయిదా

అనంతపురం క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన డ్రైవర్ల బదిలీ ప్రక్రియ గురువారానికి వాయిదా పడింది. సాధారణ బదిలీల్లో భాగంగా తన కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ చేపట్టిన బదిలీల ప్రక్రియపై డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గురువారానికి బదిలీ ప్రక్రియ వాయిదా వేయాలని విజ్ఞప్తి చేయడంతో అధికారులు స్పందించి, ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు.


వ్యక్తి బలవన్మరణం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆ అలవాటును మానుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన సర్దార్ (37)కు భార్య, పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో పనిపాటా చేకుండా మత్తులో జోగసాగాడు. ఈ క్రమంలో కుటుంబపోషణ, తన అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. వడ్డీలకు వడ్డీలు పెరిగి అప్పు తీర్చడం పెనుభారంగా మారడంతో ఇబ్బంది పడ్డ సర్దార్ బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారంతో నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

శెట్టూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం యాటకల్లుకు చెందిన బోయ జయరాము (45)కు భార్య పాలక్క, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల అప్పు చేసి 40 గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి, పోషణ చేపట్టాడు. వీటిలో 15 వరకు ఒక్కొక్కటిగా మృతి చెందడంతో అప్పు తీర్చలేక పోయానంటూ మదనపడేవాడు. ఈ క్రమంలోనే వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం ఉదయం తన భార్యను జీవాలు మేపేందుకు వెళ్లమని చెప్పి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఎస్‌ఐ యువరాజ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జలపాతంలో పడి బాలుడి మృతి



విజయ్‌నాయక్ (ఫైల్)

యాడికి: స్నేహితులతో కలసి విహారయాత్రకు వచ్చిన ఓ బాలుడు.. ప్రమాదవశాత్తు జలపాతంలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం సీతమ్మ తండాకు చెందిన నాగులు నాయక్, శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం రాత్రి సీతమ్మ తండా పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నాగులు నాయక్ చిన్న కుమారుడు విజయ్‌నాయక్(17) తన స్నేహితులతో కలసి యాడికి మండలం కోనక్షేత్రంలో ఉన్న జలపాతాన్ని చూసేందుకు వచ్చారు. సరదాగా అందరూ జలపాతాల్లో స్నానం చేసిన తరువాత విజయ్‌నాయక్ మారడమ్మ జలపాతం వద్ద పైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలు జారింది. దాదాపు 40 అడుగుల ఎత్తు నుంచి జలపాతంలోకి పడిన విజయ్‌నాయక్‌కు వెన్నముక విరిగింది. తలకు బలమైన గాయమైంది. స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న సీతమ్మ తండా వాసులు అక్కడకు చేరుకుని ప్రైవేట్ వాహనంలో డోన్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

క్లుప్తంగా

వివాదాస్పద స్థలం పరిశీలన



పేరూరుకొత్తపల్లి గ్రామంలో రైతులతో చర్చిస్తున్న అధికారులు

రామగిరి: మండల పరిధిలోని పేరూరు కొత్తపల్లి గ్రామంలో వివాదాస్పద స్థలాన్ని బుధవారం తహసీల్దార్ నారాయణస్వామి, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు పరిశీలించారు. సర్వే నంబర్ 150లో పొలాలకు వెళ్లే దారి ఉండగా, పొలం యజమాని ఇటీవల దారికి అడ్డంగా రాళ్లు వేశాడని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే కొత్తపల్లి గ్రామానికి వచ్చిన అధికారులు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

జగన్నాథ రథోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు

అనంతపురం కల్చరల్: జగన్నాథ రథోత్సవంలో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఇస్కాన్ గోశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న ఇస్కాన్ మందిరంలో జగన్నాథ రథానికి ప్రత్యేక పూజలు, రాధాపార్థసారథులకు అభిషేకాలు జరుగుతాయన్నారు. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవంత్ రమణదాసు రథోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి పురవీధుల్లో కొనసాగుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసే కళాకారులు అద్భుత విన్యాసాలను ప్రదర్శిస్తారన్నారు. వలంటీర్లుగా పనిచేయడానికి 9603699919 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టీటీడీ ధార్మిక ప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు, బృందావనం ఇస్కాన్ ప్రతినిధి చంద్రప్రభు దాసు, రథోత్సవ కమిటీ సభ్యుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయండి

- సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: నూతన మెనూ సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లతో నిర్వహించిన సమావేశంలో జేడీ మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి ప్రభుత్వం కొత్త మెనూ ప్రవేశపెట్టిందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు రోజూ బయోమెట్రిక్ నమోదు చేయాలని ఆదేశించారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, ఫక్కీరయ్య, రాధిక, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన ఓసీ నేతలు



డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జి.కరుణాకరరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డిని బుధవారం ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీని చాంబర్‌లో శాలువాతో సత్కరించారు. డీఐజీని కలిసిన వారిలో నాయకులు బుర్రా జయవర్ధన్‌రెడ్డి, టి.సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కనగానపల్లి: స్థానిక మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు.

యోగా భారతీయ వారసత్వ సంపద





యోగా చేస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ రఘునందన్ తదితరులు, కనగానపల్లి పాఠశాల ఆవరణలో యోగాసనాలు, అనంతపురంలో విద్యార్థినుల యోగాభ్యాసం

అనంతపురం క్రైం: యోగా భారతీయ వారసత్వ సంపద అని, ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగస్వామ్యం చేసుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వైద్య కళాశాల ఆడిటోరియం మైదానంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలు సైతం యోగాను అనుసరిస్తున్నాయంటే దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ హేమలత, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొఫెసర్లు డాక్టర్ గీత, డాక్టర్ సరళ, డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర, ఎన్ఎస్ఎస్, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ మహిళా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్‌తో పాటు ప్రిన్సిపాల్ లక్ష్మి రంగయ్య, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జీఎల్ఎన్ ప్రసాద్, ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు తదితరులు హాజరై.. యోగా ప్రాధాన్యత వివరించారు. పతంజలి యోగా గురువు మహేష్‌బాబు అందరితో యోగా చేయించారు.

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో యోగా మాస్టరు సుబ్బరాయుడు వందలాది మంది విద్యార్థులచేత యోగాసనాలు వేయించారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం అద్భుతమైన యోగాసనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్, పీడీలు రమేష్, మాధవరాజులు, సర్పంచ్ అంకె పరిమళ పాల్గొన్నారు.

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ పి.సుజాత హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భవాని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి.విష్ణువర్ధన్, డాక్టర్ కే.జితేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై..యోగా ప్రాధాన్యతను వివరించారు. రెక్టార్ ఏ.మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఏ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో వీసీ ఎస్ఎం కోరి, డీన్ ఇన్‌చార్జ్ రాంరెడ్డి తదితరులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటీపీఆర్ఐలో డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ఎస్కేయూలో యోగాసనాల్లో ప్రొఫెసర్లు



రాప్తాడులో యోగా చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రాప్తాడు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాప్తాడులో స్థానిక చెరువు కట్ట దగ్గర అధికారులు, ప్రజా ప్రతినిధులు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీడీ మాట్లాడుతూ, యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, రోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ అనురాధ, ఎంపీడీఓ సాల్మన్, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ మండల కన్వీనర్ నారాయణస్వామి, బీసీ సెల్ నాయకుడు ఆది, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసగౌడ్‌కు కొత్తపల్లి సాహితీ పురస్కారం



శ్రీనివాస గౌడ్

అనంతపురం కల్చరల్: కొత్తపల్లి సురేంద్రబాబు సాహితీ పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ కవి శ్రీనివాస గౌడ్‌ను ఎంపిక చేసినట్టు అవార్డు నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ తెలిపారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన శ్రీనివాస గౌడ్ కవిత్వం, కథ, విమర్శ, అనువాదాలలో తనదైన ప్రత్యేక శైలిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. 50 పుస్తకాలు పోటీకి వస్తే అందులో శ్రీనివాస గౌడ్ రచించిన 'చిన్ని చిన్ని సంగతులు' కవితా సంపుటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో అనంతపురంలో జరిగే కార్యక్రమంలో శ్రీనివాస గౌడ్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఐదో రోడ్డు ప్రజలతో త్రీటౌన్ పోలీసులు పలు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పిల్లలు చెడుదారి పట్టకుండా పర్యవేక్షణ ఉంచాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డయల్ 100 ద్వారా పోలీసు సేవలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐ కత్తి శ్రీనివాసులతో పాటు ఎస్‌ఐ వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



బద్దలాపురంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కనగానపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన హౌసింగ్ అధికారులు, మండల వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మండలంలోని బద్దలాపురం గ్రామంలోని జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ ఏఈ చిరంజీవికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బోర్లతో రైతులకు మేలు

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో వేయిస్తున్న ఉచిత బోర్ల కార్యక్రమం ద్వారా ఎంతో రైతులకు మేలు జరుగుతోందని సొసైటీ అధ్యక్షుడు వలగొండ భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన జెడ్పీటీసీ మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి రైతు కురుబ రమేష్ పొలంలో వేసిన బోరును పరిశీలించారు. నీరు పుష్కలంగా పడటంతో హర్షం వ్యక్తం చేశారు.

పవన్ అజ్ఞాని



పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌కు రాసిన లేఖలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

అనంతపురం క్రైం: జనసేన అధినేత, అజ్ఞానవాసి పవన్ కళ్యాణ్ చెప్పే ప్రతి మాటా అబద్ధమేనని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కాకినాడ బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 31 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని పవన్ కళ్యాణ్ ఆరోపించడం అర్థరహితమన్నారు. సీఎం జగన్ మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళ్తున్నారన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మహిళలకు రక్షణనందించేందుకు 'దిశ' పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారన్నారు. మహిళలకు అన్ని విధాలా అండగా ఉన్న ప్రభుత్వంపై నోరుపారేసుకోవడం తగదన్నారు. పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డైరెక్టర్ శోభారాణి, నాయకులు మునీరా, పార్వతి, భారతి, నారాయణమ్మ, జయమ్మ, అంజలి, ప్రసన్నలక్ష్మి, కమల, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థుల డిబార్

అనంతపురం: ఎస్కేయూ బీఎస్సీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలలో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో రెండు పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంటే చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజా దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ఉంటుందని, మెరిట్ మేరకు విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు.

మూడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఇళ్ల పట్టాలకు సర్వే

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లో మూడు దశాబ్దాల పట్టాల సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే నాలుగు రోజుల కిందట విద్యారణ్యనగర్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కల్గిన లబ్ధిని వివరిస్తూనే మరో వైపు ప్రజల ఇతర సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కురుబ వెంకటేశ్వర్లుతో కలిసి స్థానికులు షేక్ రమీజాబీ, పాండు తదితరులు ఎమ్మెల్యేని కలిసి 30 ఏళ్లుగా ఇక్కడ గుడిసెలు, ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, ఇప్పటిదాకా పట్టాలు మంజూరు కాలేదని వాపోయారు. 107–1 సర్వే నంబరులోని 70 సెంట్లస్థలంలో దాదాపు 32 ఇళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈసీ కోరుతున్నా ఈ భూమి గయాలు (ఎవరికీ హక్కు లేదు) అన్నట్లుగా వస్తోందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. వెంటనే ఇక్కడ ఉన్న ఇళ్లన్నింటినీ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం ఎ.నారాయణపురం–5 సచివాలయ సెక్రటరీ బాలచంద్రారెడ్డి, సర్వేయర్ వైష్ణవి, ఇతర సచివాలయ ఉద్యోగులు ఇళ్లన్నింటినీ సర్వే చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని సెక్రటరీ బాలచంద్రారెడ్డి తెలిపారు.



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

అందరికీ పట్టాలిప్పిస్తాం



విద్యారణ్యనగర్‌లో కొందరు 30 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకుని పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని గడప గడపకూ మన ప్రభుత్వంలో నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ భూమి గయాలు (ఎవరికీ హక్కు లేదు) అన్నట్లుగా వస్తోందని చెబుతున్నారు. వెంటనే సర్వే చేయాలని ఆదేశించాం. సచివాలయ ఉద్యోగులు సర్వే కూడా పూర్తి చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఇక్కడ ఉన్న వారందరికీ పట్టాలిప్పించేలా చర్యలు తీసుకుంటాం. – తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

ముస్లింలపై పవన్ కపట ప్రేమ

అనంతపురం సిటీ: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓట్ల కోసం ముస్లిం మైనార్టీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని మేయర్ వసీం విమర్శించారు. బుధవారం సాయంత్రం మేయర్ మీడియాతో మాట్లాడారు. కాకినాడ సభలో పవన్ తన ప్రసంగంలో ముస్లింలనుద్దేశించి 'మీరు మైనారిటీలు కాదు.. మెజార్టీనే' అని చెప్పడం నిజమేనని అంగీకరించారు. అయితే ఆ ఒక్క విషయం మినహా మిగిలిన అన్నీ అబద్ధాలేనని ధ్వజమెత్తారు. మతతత్వ బీజేపీతో ప్రయాణం సాగిస్తున్న పవన్.. ముస్లింలకు అండగా ఉంటానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన మేనిఫెస్టోలో ముస్లింల రిజర్వేషన్ తొలగిస్తామని ప్రకటించినప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేకపోయారని నిలదీశారు. దేశవ్యాప్తంగా మైనారిటీలకు వ్యతిరేకంగా బీజేపీ, అనుబంధ సంఘాలు చేస్తున్న అరాచకాలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు ముస్లిం మైనారిటీలపై ఎక్కడలేని ప్రేమ చూపితే నమ్మేందుకు తాము సిద్ధంగా లేమని హితవు పలికారు. అసలు ఎక్కడి నుంచి ఈసారి ఎమ్మెల్యేగా నిలబడతారో, అసెంబ్లీలో ఏ విధంగా అడుగుపెడతారో ఆ దిశగా ప్రయత్నిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. ముస్లిం మైనారిటీల పక్షపాతి వైఎస్ కుటుంబం ఒక్కటేనని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే.. ఆయన తనయుడు వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేసి అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాజకీయ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లోనూ ముస్లింలకు ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముస్లింను డిప్యూటీ సీఎం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలందరూ జగన్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. పవన్ అవసరం తమకు ఏమాత్రం లేదని, మైనారిటీలను మభ్యపెట్టే మాటలు మాట్లాడొద్దని హితవు పలికారు.



మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం సలీం

ఉత్తీర్ణత పెరగకపోతే చర్యలు

- పేరూరు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు ఏజీఓ హెచ్చరిక

రామగిరి: 'మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సౌకర్యాలన్నీ కల్పిస్తోంది. కానీ ఇక్కడి ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. అందువల్లే పదో తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గితే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు'' అని గురుకుల పాఠశాలల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ (ఏజీఓ) రాజేంద్రనాథ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పేరూరు డ్యాంలోని ఏపీ ఆర్ఎస్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలో ఈ పాఠశాల ఉత్తీర్ణత చాలా బాగుండేదని, ఉపాధ్యాయుల లోపంతో మూడేళ్లుగా ఉత్తీర్ణత శాతం బాగా పడిపోయిందన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణత వందశాతం రాక పోతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల భోజన వసతిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబులేసుతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పేరూరుడ్యాంలోని బీసీ బాలుర పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏజీఓ

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

రాప్తాడు: నవరత్నాలు– అందరికీ ఇళ్లు పథకంలో ఇళ్లు మంజూరైన వారంతా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ సాల్మన్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులు.. త్వరగతిన పూర్తి చేసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఏమైనా సమస్యలుంటే ఎంపీపీ, ఎంపీడీఓ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఆత్మకూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులను బుధవారం గ్రామస్తులు, విద్యార్థులు వారిని సన్మానించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవ, పీడీ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు యుగంధర్, నాగమణి, దేవేంద్రనాయక్, భానుమతి, బషీర్‌కు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఆత్మకూరుతో అనుబంధం మరువలేనిదన్నారు. తల్లిదండ్రులను విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బందూక మధు, శ్రీధర్ ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, గురుమూర్తి, శీన, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఉపాధ్యాయులు ఎంఈఓలను సన్మానించారు. ఎంఈఓ–1 నరసింహారెడ్డికి, నూతన ఎంఈఓ–2 రామాంజనేయులకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

'జగనన్న సురక్ష'తో సేవలు పటిష్టం

- ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: పౌరసేవలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ అధ్యక్షతన మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల్లో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సర్టిఫికెట్లు పొందాలన్నారు. మండల స్థాయి అధికారులు బృందంగా ఏర్పడి రోజూ ఒక గ్రామ సచివాలయ పరిధిలో పర్యటిస్తారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పథకాలు లబ్ధి చేకూరుస్తారన్నారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశం గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, హార్టికల్చర్ జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

అనంతపురం క్రైం: బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. గత నెలలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పర్యటన సందర్భంగా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ రఘునందన్ విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. బుధవారం జూమ్ వీడియా కాన్ఫరెన్స్‌లో బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని డీఎంఈ పేర్కొన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ వచ్చే నిధులతో ఆస్పత్రిలో 110 ఏసీల నిర్వహణ, బోధనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీలోని ఎస్‌టీపీ, లిఫ్ట్ నిర్వహణ తదితర పనులు చేపడతామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

రాప్తాడురూరల్: నగరంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో బుధవారం ఆర్బీఐ ఆధ్వర్యంలో 'ఆర్థిక అక్షరాస్యత' అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన రుద్రంపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థికి రూ.5వేలు, రెండో స్థానంలో నిలిచిన ఎస్ఎంజీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థికి రూ.4 వేలు, తృతీయస్థానంలో నిలిచిన కేఎస్ఆర్ పాఠశాల విద్యార్థికి రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యరాజు, ఎంఈఓ వెంకటస్వామి, ఎంఈఓ–2 సంతోషిరాణి, హెచ్ఎం కిరణ్మయి, పీడీ నగేష్ పాల్గొన్నారు.